క్లుప్తంగా

పులి వాహనంపై సంగమేశ్వరుడు



పులి వాహనంపై కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి

సంగం: సంగంలో కొలువైన కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి స్వామి అమ్మవార్లకు పులి వాహన సేవ ఘనంగా జరిగింది. అర్చకులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పులి వాహనంపై కొలువు దీర్చారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెరుమాళ్ల రవీంద్రబాబు, ప్రధాన అర్చకులు గోపాలకృష్ణమూర్తి, అర్చకులు రఘుస్వామి, నాగేంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు



ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు: నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు పూర్తి చేసుకుని గురువారం ఈద్ ఉల్ ఫితర్ (రమజాన్) పర్వదినాన్ని జరుపుకోనున్న ముస్లింలకు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు బుధవారం తెలిపారు. అల్లాహ్ దీవెనలతో సర్వ మానవాళికి శుభాలు కలగాలని ఆకాంక్షిస్తూ త్యాగానికి, క్రమ శిక్షణకు, దాతృత్వానికి, ధార్మిక చింతన కలయికగా రంజాన్ విశిష్టమైన పండగ అని ఆయన అభివర్ణించారు.

ఉదయగిరి: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని ముస్లింలకు ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. నెల రోజుల ఉపవాస దీక్షల తర్వాత జరుపుకునే రంజాన్ పర్వదినంలో సంతోషంగా, ఉల్లాసంగా గడపాలని ఆకాంక్షించారు.

ఆరుతడి పంటలు వేసుకోండి

జలదంకి: ప్రస్తుతం రెండో పంటగా ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని వింజమూరు ఏడీఏ రామిరెడ్డి, ఏఓ శైలజ తెలిపారు. బుధవారం జలదంకి, హనుమకొండపాళెం గ్రామాల్లో రైతులకు అవగాహనా కార్యక్రమం చేపట్టారు. సోమశిల ప్రాజెక్ట్‌లో నీరు లేనందున కావలి కాలువకు సాగునీరు జరగదన్నారు. బోర్లు, బావుల కింద కూడా వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు వేరుశనగ, పిల్లిపెసర వేసుకోవాలన్నారు.


ఆలయ పునర్నిర్మాణానికి విశేష పూజలు



హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

ఉదయగిరి: మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీలో బుధవారం రామాలయం పునర్నిర్మాణానికి వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు. కాలనీలో పదిహేనేళ్ల క్రితం రామాలయం నిర్మాణం చేపట్టారు. అయితే అనివార్య కారణాలతో నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. తిరిగి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కాలనీ వాసులు చర్యలు చేపట్టారు. వేదపండితులతో పునర్నిర్మాణ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఏడీఎంహెచ్‌ఓ తనిఖీ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి

సంగం: సంగం పీహెచ్‌సీని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక వైద్యాధికారితో కలిసి ఫార్మసీ విభాగాన్ని, వ్యాక్సిన్ నిల్వ కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫార్మసీ అధికారి ప్రదీప్‌కుమార్‌తో మాట్లాడి టీబీ మెడిసిన్‌కు సంబంధించిన వివరాలు, మండలంలో టీబీ రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అశోక్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేమిరెడ్డి, కాకర్లకు అవమానం

- టీడీపీ అభ్యర్థుల ప్రచారానికి స్పందన కరువు
- ఆసక్తి చూపని టీడీపీ శ్రేణులు
- మాజీ ఎమ్మెల్యే బొల్లినేని దూరం



కలిగిరిలో టీడీపీ అభ్యర్థుల ప్రచారంలో పట్టుమని పాతిక మంది కూడా లేని దృశ్యం

కలిగిరి: కలిగిరిలో టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ బుధవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమానికి కనీస స్పందన కరువైంది. తొలుత కలిగిరమ్మ తల్లి ఆలయం, శివాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కలిగిరి పాతూరు నుంచి ప్రచారం ప్రారంభించారు. ఆర్భాటంగా ప్రచారం నిర్వహించాలని భావించిన అభ్యర్థులకు ఆ పార్టీ శ్రేణులే ముఖం చాటేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి పార్టీ శ్రేణులతో పాటు బీజేపీ, జనసేనలను కూడా ఆహ్వానించారు. అయితే బీజేపీ, జనసేన నుంచి ఎవరూ హాజరు కాలేదు. టీడీపీ శ్రేణులు అరకొరగా హాజరైనప్పటికీ ప్రచారంలో పాల్గొనడానికి ఆసక్తి చూపలేదు. కనీసం పార్టీ జెండాలు కూడా పట్టుకోలేదు. ప్రచారం ప్రారంభించిన పది నిమిషాలకే పార్టీ శ్రేణులు జారుకున్నారు. పట్టుమని పాతిక మంది కూడా ప్రచారంలో లేకపోవడం చూసి జనం పెదవి విరిచారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారం పరిస్థితి మరింత దారుణంగా ఉందని స్థానిక టీడీపీ నాయకులే చర్చించుకోవడం విశేషం. కలిగిరి పాతూరులో ప్రచారం అనంతరం కలిగిరమ్మ తల్లి ఆలయం నుంచి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కనీసం పది మంది కూడా లేరు. ర్యాలీ అట్టర్ ఫ్లాప్ అయింది. మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలను కలుపు పోవడంలో ఉదయగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ పూర్తిగా విఫలం అయ్యారనడానికి ఈ ప్రచార కార్యక్రమే నిదర్శనంగా నిలిచింది.

టీడీపీ కార్యక్రమాలకు బొల్లినేని దూరం

ఎమ్మెల్యే అభ్యర్థిగా కాకర్లను ప్రకటించినప్పటి నుంచి టీడీపీ కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు దూరంగా ఉంటున్నారు. కలిగిరితో పాటు నియోజకవర్గంలో జరిగిన పలు కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని మంగళవారం పాల్గొన్నారు. అయితే బుధవారం కలిగిరిలో టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారం ఉందని తెలిసినప్పటికి ఆయన అందుబాటులో లేకుండా వెళ్లిపోయారు. కనీసం ప్రచార కార్యక్రమాలు చేపట్టలేని టీడీపీ అభ్యర్థులు వైఎస్సార్‌సీపీని భూస్థాపితం చేస్తామనడం విడ్డూరంగా ఉందని ప్రజలు నవ్వుకుంటున్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం

- ఆర్‌ఓ, ఆర్డీఓ కె.మధులత



మాట్లాడుతున్న ఆర్డీఓ మధులత

ఆత్మకూరు: ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా ప్రశాంతంగా జరిగేలా ఎన్నికల కమిషన్, కలెక్టర్ నేతృత్వంలో ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆత్మకూరు ఆర్డీఓ కె మధులత తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు.. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది ఏ పార్టీల తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ విషయం ఎన్నికల తేదీ ప్రకటన వెలువడక ముందే అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు సమాచారం తెలియజేశామన్నారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో పలువురు ఉద్యోగులు నిబంధనలు అతిక్రమించిన క్రమంలో సస్పెండ్ చేసినట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, సిబ్బందికి ఇప్పటికే తొలి విడత శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. 70 ఏళ్ల పైబడిన వారి ఓట్లు ఇళ్ల వద్దే పోల్ చేసేలా ఈసీ ఆదేశాల మేరకు ప్రత్యేక సిబ్బందితో సంబంధిత ఫారంలో నమోదు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో జరుగుతున్న ఖర్చును ఆయా పార్టీల ఖాతాల్లో నమోదు చేస్తున్నట్లు ఇందుకు సంబంధించి వీడియో సైతం తీయిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుంచి ఎన్నికల ప్రచార ఖర్చును ఆయా అభ్యర్థుల ఖాతాల్లో నమోదు చేయనున్నట్లు అభ్యర్థులు గమనించాలన్నారు. ఈ విషయమై రాజకీయ నాయకులతో గతంలోనే జరిగిన సమావేశంలో తెలియజేశామన్నారు.

రైతుల అభివృద్ధికి ప్రాధాన్యత



వరి ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: రైతుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రాధాన్యత ఇచ్చారని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వీరారెడ్డిపాళెంలో బుధవారం జరిగిన నర్రావుల కాంతమ్మ ఉత్తరక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం వీధిలో ఆరబోసిన ధాన్యంను పరిశీలించారు. ఆ పక్కనే రచ్చబండ వద్ద కూర్చుని ఉన్న పెద్దలతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాయన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసి గిట్టుబాటు ధరలు కల్పించిందన్నారు. చంద్రబాబు, కరువు కవల పిల్లలన్నారు. చంద్రబాబు పాలనలో రైతులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొన్నారన్నారు. వ్యవసాయం పండగలా ఉండాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. నెల్లూరు ఎంపీ విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, స్థానిక నాయకులు అంకిరెడ్డి, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



రైతుల నుంచి జొన్నలు కొనుగోలు చేస్తున్న మార్క్‌ఫెడ్ అధికారులు

వరికుంటపాడు: మండలంలోని యర్రంరెడ్డిపల్లెలో రైతుల సౌకర్యార్థం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మార్క్‌ఫెడ్ మేనేజర్ పవన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలను పరిగణలోకి తీసుకుని ఎన్‌టీజే-4, 5, సీఎస్‌వీ-24 ఎస్ఎస్ రకాల జొన్న రకాలు సాగు చేసిన రైతుల నుంచి క్వింటా రూ.3,180లకు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఒక్కో రైతు నుంచి ఐదెకరాల పంటను కొనుగోలు చేస్తామన్నారు. మార్క్‌ఫెడ్, జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోళ్ల ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ సహాయ మేనేజర్ సుధాకర్‌రావు, మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వేణు, ఏఓ రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

మూడు గడ్డివాముల దగ్ధం

జలదంకి: మండలంలోని కృష్ణాపాడులో బుధవారం మూడు వరి గడ్డివాములు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన కొలగాని పెదమస్తాన్, కొలగాని చినమస్తాన్, కేశవరం పురుషోత్తం పశుగ్రాసం నిమిత్తం ఏర్పాటు చేసుకున్న మూడు గడ్డివాములు దగ్ధం కావడంతో దాదాపు రూ.80 వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి పరిశీలించారు. బాధితులకు సహాయం అందిస్తానని తెలిపారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఉన్నారు.

ప్రత్యేకావసరాల విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేకావసరాల విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి కోరారు.ఆయన బుధవారం పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రం, నాడు-నేడు పనులను పరిశీలించారు. భవిత కేంద్రానికి స్వర్ణ టోల్‌ప్లాజా అందించిన వస్తువులను పరిశీలించారు. ఆయన వెంటహెచ్‌ఎం షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహులు, నందిని, బోసు ఉన్నారు.

15 మంది వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలతో వలంటీర్లు

సంగం: రాష్ట్ర ప్రభుత్వం అందించిన అవకాశంతో ఇప్పటి వరకు ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు, సేవలు అందించామని, ఇప్పుడు ఆ సేవలు అందించలేని వలంటీర్ పోస్టు తమకు అవసరం లేదంటూ మండలంలో పలు గ్రామాలకు చెందిన 15 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. బుధవారం తమ పంచాయతీ కార్యదర్శులకు రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ఎలాంటి అవినీతికి తావులేకుండా అందించాలనే దృఢ సంకల్పంతో విధులు నిర్వర్తించామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు గడప దాటకుండా సంక్షేమాన్ని అందించామన్నారు. ప్రతిపక్ష పార్టీల స్వార్థానికి తమను పక్కన పెట్టడం బాధాకరమన్నారు. ప్రజలకు సేవ చేయలేని తమ ఉద్యోగాలు అవసరం లేదని భావించే రాజీనామా చేశామన్నారు.

వలంటీర్ రాజీనామా

మర్రిపాడు: మండలంలోని బూదవాడ వలంటీర్‌గా పని చేస్తున్న కాకర్ల శ్రీనివాసులు రాజీనామా చేసి పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయం కోసం పని చేస్తానన్నారు.

రమణారెడ్డి మృతి తీరని లోటు



భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: దుత్తలూరు మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కండ్లగుంట రమణారెడ్డి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రమణారెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, వింజమూరు జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, నాయకులు కండ్లగుంట వెంకటేశ్వరరెడ్డి, కంభం మురళీమోహన్‌రెడ్డి, కండ్లగుంట వెంకటరెడ్డి, ఉప్పలపాటి రమణారెడ్డి, రంగయ్యనాయుడు, అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కండ్లగుంట కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ఆత్మకూరు: తీవ్ర వేసవి ఎండలతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ సమీపంలో సీపీఎం, రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో మంచినీటి చలివేంద్రంను బుధవారం ప్రారంభించారు. కొన్నేళ్లుగా సీపీఎంతో పాటు అనుబంధ సంఘాల సహకారంతో చలివేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంగయ్య, కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గంటా లక్ష్మీపతి, సీపీఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, కేవీపీఎస్ ఉపాధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

అల్లూరు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో బుధవారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి కుమార్తె దీప్తిరెడ్డి సహకారంతో ఆయన సతీమణి కాటంరెడ్డి శివప్రియ పౌష్టికాహారాన్ని అందజేశారు. గర్భిణులకు, బాలింతలకు తమవంతు సహాయం అందజేయడం సంతోషకరంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించండి



మాసాయిపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం



వింజమూరులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఉదయగిరి: మండలంలోని మాసాయిపేటలో బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇల్లు తిరిగి ఈ ఐదేళ్లలో ప్రభుత్వం ద్వారా జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాలంటే ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.శ్రీనివాసులురెడ్డి, మన్నెం వెంకటమ్మ, పి.రమణయ్య, బాలిరెడ్డి, బాల ఓబుల్ రెడ్డి, శివమణి, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఇంటింటా ప్రచారం

వింజమూరు (ఉదయగిరి): వింజమూరులోని జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు పల్లాల కొండారెడ్డి, గోపిరెడ్డి రమణారెడ్డి, పల్లాల ప్రసాద్, లెక్కల సుధాకర్‌రెడ్డి, కోడూరు రాధయ్య, కొంకల వెంకటేశ్వర్లు, బయ్యపురెడ్డి రామసుబ్బారెడ్డి, రాజు, వాణి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల్ని గెలిపించండి

జలదంకి: రానున్న ఎన్నికల్లో విజ్ఞతగా ఆలోచించి సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాలని జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల కోరారు. మండలంలోని బ్రాహ్మణక్రాకలో జెడ్పీటీసీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఉదయగిరి ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని, ఎంపీగా విజయసాయిరెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వంటేరు రామచంద్రారెడ్డి, తుమ్మల వెంకట్రామిరెడ్డి, ద్రోణాదుల కృష్ణారెడ్డి, జిలుమూడి వరదారెడ్డి, ద్రోణాదుల తిరుమలరెడ్డి, చేజర్ల హరిబాబురెడ్డి, నేతగాని భాస్కర్, తిరుపతి, వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించుకుందాం

సోమశిల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని, రానున్న ఎన్నికల్లో జగనన్నను గెలిపించుకుందామని ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, నాయకులు కోరారు. మండలంలోని లక్కరాజుపల్లిలో బుధవారం సాయంత్రం నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ సారి జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రతి ఒక్కరూ ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని, ఎంపీగా వీ విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాణెం శ్రీనివాసులు, నాయకులు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.



బ్రాహ్మణక్రాకలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ



లక్కరాజుపల్లిలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

